సాక్షి
వికారాబాద్
శుక్రవారం : 31 : మే : 2024



జోరుగా నకిలీ దందా

కొడంగల్ నియోజకవర్గ సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతోంది. 8లో▸



పాల ప్యాకెట్ కోసం వెళ్లి..

రెండేళ్ల వయస్సు.. ఒంటినిండా గాయాలు.. రోడ్డుపై విగతజీవిగా తండ్రి.. ఈ దృశ్యాన్ని చూస్తే ఎవరికైనా కన్నీరు రాక తప్పదు. 8లో▸



పచ్చిరొట్ట కోసం పరేషాన్

పచ్చిరొట్ట సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండగా.. డిమాండ్‌కు సరిపడా జనుము, జీలుగ విత్తనాల పంపిణీ కావడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



కుష్మసముద్రంలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న లింగ్యానాయక్

కుల్కచర్ల: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం మండలంలోని ముజాహిద్‌పూర్, కుష్మసముద్రం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో 90శాతం ధాన్యం సేకరించామని, మిగిలిన 10 శాతాన్ని కూడా త్వరగా కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ మురళీధర్, సీనియర్ అసిస్టెంట్ శీనయ్య, ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు కొనుగోలు ప్రక్రియ

దోమ: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని మోత్కూరు పరిధిలో గల మహాలక్ష్మి రైస్ మిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాలో 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన 40 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైస్ మిల్లులకు ధాన్యం లారీలు వస్తే వెంటనే అన్‌లోడ్ చేసి పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పరిగి: నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన నరేష్ అనారోగ్యంతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఆస్పత్రికి వెళ్లిన ఎమ్మెల్యే.. నరేష్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం అందజేసేందుకు కృషిచేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనే లక్ష్యం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



సీఐటీయూ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

తాండూరు టౌన్: కార్మిక హక్కుల సాధనే సీఐటీయూ లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర హక్కుల సాధన కోసం తాము పోరాటం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలను తెచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, సీఐటీయూ నాయకులు జైపాల్, సురేష్, రాములు, లాలప్ప, డేనియల్, రవి, శేఖర్, వెంకట్రాములు, నర్సింహులు, బేబి రాణి, నర్సింహ, వెంకటమ్మ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలి

యాచారం: వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేలా గుంతలు తీయడం పూర్తి చేయాలని డీఆర్‌డీఓ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో గురువారం ఆమె పర్యటించారు. గ్రామంలో ఉన్న నర్సరీని, ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామంలోని రైతులు పెంచుతున్న పండ్లతోటలను పరిశీలించారు. ఉపాధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలపై చైతన్యం, అవగాహన కల్పించాలన్నారు. గతంలో ఈజీఎస్ నిధులతో పండ్లతోటలు పెంపకం చేపట్టిన రైతులు ప్రస్తుతం మంచి లాభాలు గడిస్తున్నారని గుర్తు చేశారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు వెంటనే బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియా, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ లింగయ్య తదితరులు ఉన్నారు.

కాసుల కక్కుర్తే!

విద్యను వ్యాపారంగా భావిస్తున్న ప్రైవేట్ సంస్థలు

- ఫీజుల దోపిడీ తప్ప నిబంధనలు పట్టని దుస్థితి
- అర్హత లేని సిబ్బందితో బోధన
- అసౌకర్యాల మధ్యే స్కూళ్ల నిర్వహణ
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ
- ఆందోళనలో తల్లిదండ్రులు



వికారాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాల

వికారాబాద్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా స్కూళ్లు నడుపుతూ ఒక్కో విద్యార్థి నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారు. అర్హత లేని టీచర్లతో బోధన, పరోక్షంగా పుస్తకాలు, యూనిఫాంల వ్యాపారం, స్టేట్, సెంట్రల్ సిలబస్ పేరిట అధిక ఫీజులు వసూలు.. ఇలా చెప్పుకుంటే పోతే వారి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల వేట మొదలు పెట్టాయి. మా పాఠశాలలో చేరితే పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఆశలు రేపి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అయితే చాలా మంది తల్లిదండ్రులు స్కూళ్లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా, వసతులు, అర్హులైన టీచర్లు ఉన్నారా అని తెలుసుకోకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

వసతులు లేని స్కూళ్లకు అనుమతులు

నిబంధనలు పాటించని స్కూళ్లకు విద్యాశాఖ నుంచి అనుమతులు వస్తుండటం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని మెజార్టీ ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నెలకొల్పినవే కావటం గమనార్హం. వసతులు లేని స్కూళ్లకు నోటీసులు పంపుతున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా పైనుంచి అనుమతులు మాత్రం ఆగడం లేదు. జిల్లాలో 220 వరకు ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 10 శాతం స్కూళ్లు మాత్రమే నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్నారు. చాలా స్కూళ్లలో కనీస వసతులు కూడా లేవు. తరగతి గదికి కిటికీలు లేని స్కూళ్లు కూడా ఉన్నాయి. ఇలాంటి వాటికి కూడా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ప్రధాన రహదారులకు సమీపంలోని స్కూళ్లకు ప్రహరీలు కూడా లేవు. అలాంటి వాటికి పోలీసులు.. ట్రాఫిక్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

అంతా వ్యాపార ధోరణే

ప్రైవేటు విద్యాసంస్థలు పూర్తిగా వ్యాపార ధోరణి అవలంబిస్తున్నాయి. విద్యార్థుల ఫీజులు మొదలుకొని, పుస్తకాలు, యూనిఫాం, రవాణా, టర్మ్ ఫీజుల పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. ఏ మాత్రం సౌకర్యాలు లేని పాఠశాలల్లో కూడా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సంవత్సరానికి రూ. 30వేల నుంచి రూ. 1.30 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ పిల్లలకే ఏకంగా సంవత్సరానికి రూ. 35 వేలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ఫీజు కంటే ఐదు నుంచి పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కాకుండా నోట్ బుక్స్, ఆయా పాఠశాలల వర్క్ బుక్స్ పేరిట రూ. 3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవే పుస్తకాలు దుకాణాల్లో కొనుగోలు చేస్తే రూ. వెయ్యికి మించదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ బయట పుస్తకాలు కొనుగోలు చేస్తే వాటిని స్కూల్ యాజమాన్యాలు అనుమతించడం లేదు. చాలా స్కూళ్లల్లో పుస్తకాలు, యూనిఫాలంను వారే విక్రయిస్తున్నారు.

ఇంటర్‌లోనూ ఇదే పరిస్థితి

ఇక ఇంటర్ మొదటి సంవత్సరానికి రూ.18 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో మంచి మార్కులు వచ్చిన స్కూల్ యాజమాన్యాలు ఫీజులను అమాంతం పెంచేశారు. నీట్, జేఈఈ, ఎంసెట్ ప్రత్యేక తరగతుల పేరిట తల్లిదండ్రులను ఊరిస్తూ అదనంగా వసూలు చేస్తున్నారు. పదో తరగతిలో మంచి గ్రేడ్ సాధించిన విద్యార్థులకు మాత్రం కొంత మేర ఫీజులు తగ్గిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని పాఠశాలల్లో జూన్ నెల ఫీజు కట్టించుకుంటున్నారు. లేకుంటే పుస్తకాలు కూడా ఇవ్వడం లేదు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఫీజులను నియంత్రించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

ఆ తరగతులకు అనుమతులు లేవు: ఎంఈఓ



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: పట్టణంలోని నారాయణ ఇంటర్నేషనల్ స్కూల్‌కి ఒకటి నుంచి 7వ తరగతి వరకే అనుమతులు ఉన్నాయని, 8నుంచి 10వ తరగతి వరకు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా 8 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు 8, 9, 10వ తరగతుల్లో పిల్లలను చేర్చరాదని సూచించారు. ఇప్పటికే అడ్మిషన్లు పొంది ఉంటే తనను సంప్రదిస్తే ఇతర పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించనున్నట్లు తెలిపారు. స్కూల్ యాజమాన్యం చెప్పే మాయమాటలు నమ్మరాదన్నారు. పాఠశాలలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా తన సెల్ నంబర్ 9581248866లో సంప్రదించాలని కోరారు. అనుమతులు లేకుండా పాఠశాలలు, తరగతులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎంఈఓ హెచ్చరించారు.

చిన్ని గుండెకు పెద్ద ఆపద

- గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడు
- రూ.4 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపిన డాక్టర్లు
- ఇప్పటికే రూ.లక్ష వరకు అప్పు చేసిన తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు





నగరంలో చికిత్స పొందుతున్న దిలీప్‌కుమార్

కుల్కచర్ల: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం.. ఉన్న ఊరులో ఉపాధి లేక కొన్ని రోజులు ముంబైలో, మరికొన్ని రోజులు నగరంలో పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్దబాబు వయస్సు నాలుగేళ్లు.. ఆ బాలుడికి పెద్ద కష్టం వచ్చి పడింది. దీంతో ఆ కుటుంబంలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం ఘణపూర్‌కు చెందిన గజ్జి బాలమణి భీమయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద బాబు దిలీప్‌కుమార్(4) కొన్నిరోజులుగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల బాలుడిని తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలుడి గుండెకు పెద్ద రంధ్రం ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. గుండె వాపు అధికంగా ఉందని, మరో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం మరో రూ. లక్ష వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఒక్కసారిగా బాలమణి భీమయ్య దంపతులు ఆందోళనకు గురయ్యారు. తమ కుమారుడి వైద్యం కోసం లక్ష వరకు అప్పు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వైద్యం చేయించలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు సహకరించాలని వేడుకున్నారు. ప్రస్తుతం బాలుడు నగరంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సహాయం చేయాలనుకునే దాతలు.. మాసయ్య సెల్ నంబర్ 9594679677కు ఫోన్ చేయాలని బాలుడి తల్లిదండ్రులు బాలమణి భీమయ్య వేడుకున్నారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ దుర్మరణం

చౌడాపూర్ మండలంలో ఘటన





చంద్రయ్య మృతదేహం

కుల్కచర్ల: ఉపాధి హామీ పనులు చేస్తుండగా కూలీ వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన చౌడాపూర్ మండలం బంగ్రంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిచ్చపు చంద్రయ్య(59) రోజులాగే ఉపాధి పనికి వెళ్లాడు. సోమసముద్రం చెరువులో ఒండ్రు మట్టి తవ్వుతుండగా అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. ఆందోళనకు గురైన తోటి కూలీలు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందాడు. పనులు చేసే చోట నీడ, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వడదెబ్బకు గురై మృతిచెందాడని సహచర కూలీలు తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు.



మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ అశోక్

‘బడిబాట’ను విజయవంతం చేద్దాం

జిల్లా స్పెషల్ ఆఫీసర్ అశోక్

బంట్వారం: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా స్పెషల్ ఆఫీసర్ అశోక్ అన్నారు. జూన్ 3వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులపై గురువారం కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీ నాటికి అమ్మ ఆదర్శ పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కోట్‌పల్లి మండలంలో పాఠశాలల అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరైనట్లు వివరించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడరాదని సూచించారు. అంతకుముందు బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో బడిబాటపై ఎంపీడీఓ గోపాల్ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల్ని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, కోట్‌పల్లి, బంట్వారం ఎంపీడీఓలు గోపాల్, డానియల్, ఎంపీఓ విజయ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం దేవయ్య, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పదో తరగతి ఓ మైలు రాయి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఓ మైలురాయి వంటిదని, విద్యార్థులు సాధించిన విజయంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని కలెక్టర్ శశాంక అన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం కలెక్టరేట్‌లో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 50,807 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, వీరిలో 46,245 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 36 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని, 50 మంది విద్యార్థులు 10/10 గ్రేడ్ పాయింట్స్ సాధించారని చెప్పారు. విద్యార్థులు ఇక్కడి నుంచి ఏ స్థాయికి వెళ్తారనేది మీపైన, మీ ఆలోచన విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. గొప్పగా ఆలోచించాలని, గొప్పగా ఎదిగి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ చేతుల మీదుగా పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు, సబ్జెక్టు రిసోర్స్ ఉపాధ్యాయులకు, కోఆర్డినేషన్ టీంకు పురస్కారాలు అందజేశారు.

‘పవర్’ఫుల్

SAKSHI INTERVIEW సాక్షి



- బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ తగ్గుముఖం
- ఒత్తిడికి గురైన సబ్‌స్టేషన్లను గుర్తించాం
- పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం
- అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా
- ‘సాక్షి’తో ఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘‘గతంతో పోలిస్తే బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ సంఖ్య భారీగా తగ్గుముఖం పట్టాయి. అంతేకాదు విద్యుత్ సరఫరాలో అంతరాయం కూడా భారీగా తగ్గింది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లను గుర్తించి, వాటిలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాం. ఈదురుగాలితో కూడిన వర్షం వంటి విపత్తులను తట్టుకుని నిలబడేలా లైన్లను తీర్చిదిద్దాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా సబ్‌స్టేషన్లను, వాటిలోని ఫీడర్లను, పంపిణీ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడుతున్నాం’’ అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీ ఎం పెరుమాళ్ల ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగు కోసం సరూర్‌నగర్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, వికారాబాద్ సర్కిళ్ల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించారు.

ఫీడర్లపై ఒత్తిడి లేకుండా..

శివారు ప్రాంతాలు శర వేగంగా విస్తరిస్తున్నాయి. గృహ, వాణిజ్య కనెక్షన్లతో పాటు విద్యుత్ వినియోగం రెట్టింపైంది. సామర్థ్యానికి మించి డిమాండ్ నమోదవుతోంది. సబ్‌స్టేషన్లు ఒత్తిడికి గురై.. తరచూ ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. సరఫరాలో అంతరాయాలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిస్కం భావించింది. రూ.12.50 కోట్లు ఖర్చు చేసి కోకాపేట్, నార్సింగి, ఉమ్దానగర్, ఇన్మోల్‌నర్వ్, తుర్కయంజాల్, తట్టి అన్నారం, నందనవనం, వికారాబాద్ పట్టణం సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 5 నుంచి 8 ఎంవీఏకు పెంచాం. గచ్చిబౌలి, జల్‌పల్లి, గండంగూడ, మదర్‌డెయిరీ సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 8 నుంచి 12.5 ఎంవీఏకు పెంచాం. సబ్‌స్టేషన్లలోని ఫీడర్లపై ఒత్తిడి లేకుండా చూశాం. సాధ్యమైనంత మేరకు అంతరాయాలను నివారించి, సరఫరా మెరుగుపర్చాం.

ట్రిప్పింగ్స్ గణనీయంగా తగ్గాయి

గత ఏడాది జనవరి 23 నుంచి మే 23 మధ్య కాలంలో 33 కేవీ ఫీడర్ల పరిధిలో 77 బ్రేక్‌డౌన్స్ నమోదు కాగా, 145.18 గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ఇదే సమయంలో 56 బ్రేక్‌డౌన్స్ నమోదు కాగా, సరఫరాలో అంతరాయం కూడా 78.35 గంటలకు తగ్గిపోయింది. ఇక గత ఏడాది 1,086 ట్రిప్పింగ్స్ నమోదు కాగా, 328.20 గంటలు సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ట్రిప్పింగ్స్ సంఖ్య 790కి తగ్గిపోగా, సరఫరా నిలిచిపోయిన సమయం కూడా 187.45 గంటలకు తగ్గింది. ఇక 11 కేవీ ఫీడర్ల పరిధిలో గత ఏడాది ఇదే సమయానికి 552 బ్రేక్‌డౌన్స్ నమోదు కాగా, 764.37 గంటల సమయం సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది బ్రేక్‌డౌన్స్ కొంత పెరిగినప్పటికీ.. కరెంట్ నిలిచిపోయిన సమయం చాలా తక్కువ. 11 కేవీ ఫీడర్ల ట్రిప్పింగ్స్ సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది 9,334 ట్రిప్పింగ్స్ నమోదు కాగా, ఈసారి 7,330 మాత్రమే నమోదయ్యాయి.

డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

నాలుగు సర్కిళ్ల పరిధిలో గత ఏడాది మార్చిలో గరిష్ఠ డిమాండ్ 1,309 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది ఇదే సమయంలో 1,582 మెగావాట్లకు చేరుకుంది. గత ఏప్రిల్‌లో 1,395 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏప్రిల్‌లో 1,814 మెగావాట్లు నమోదైంది. ఇక గత మేలో 1,334 మెగావాట్లు నమోదు కాగా, ఈసారి ఏకంగా 1,698 మెగావాట్లకు చేరింది. జిల్లాలో గత ఏడాది మార్చిలో రోజు సగటు విద్యుత్ డిమాండ్ 27.84 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈ మార్చిలో 32.78 ఎంయూలకు చేరింది. గత ఏప్రిల్‌లో 28.55 ఎంయూలు కాగా, ఈసారి 35.22 ఎంయూలకు చేరింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపర్చాం. రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లతో పోలిస్తే అత్యధిక డిమాండ్ సైబర్‌సిటీలో నమోదవుతోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తాం

రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తామని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల తనిఖీలో భాగంగా గురువారం మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ, మాల్‌మార్కెట్‌లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా అభివృద్ధి చేసి, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేల్లోపు సౌకర్యాలు కల్పిస్తామని, విద్యార్థులకు యూనిఫాం అందజేస్తామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరైన నిధులతో అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జగనాథ్, శ్రీలత తదితరులు ఉన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఈఓ

క్లుప్తంగా

నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

మిషన్‌ భగీరథ డీఈ రమేష్‌



బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న డీఈ రమేష్‌

తాండూరు రూరల్‌: వేసవి నేపథ్యంలో ప్రజలు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని మిషన్‌ భగీరథ డీఈ రమేష్‌ కోరారు. గురువారం మండల పరిధిలోని కోటబాసుపల్లిలో నూతనంగా వేసిన బోరుమోటార్‌ను ఆయన పరిశీలించారు. కోటబాసుపల్లి, కోత్లాపూర్‌, ఉద్దండాపూర్‌ తదితర గ్రామాల్లో నూతనంగా బోరు మోటార్లు వేసినట్లు చెప్పారు. తాగునీటి సమస్య నెలకొన్న గ్రామాల్లో ప్రత్యేక చొరవ తీసుకొని బోర్లు వేశామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు తాగునీటిని వృథా చేయవద్దని కోరారు. ఆయన వెంట ఏఈ సాయి ప్రణీత్‌, నాయకులు వికాస్‌ జోస్‌, ఇంద్ర ఉన్నారు.

పని ప్రదేశంలో ఉపాధి కూలీకి గాయం



సత్తయ్య కాలికి అయిన గాయం

యాచారం: మండల పరిధిలోని తక్కళ్లపల్లికి చెందిన పంబలి సత్తయ్య అదే గ్రామంలో గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. భూ అభివృద్ధి పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రాయి సత్తయ్య కాలు మీదపడటంతో తీవ్ర గాయమైంది. తోటి కూలీలు వెంటనే గ్రామంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య.. సత్తయ్యను పరామర్శించారు. సత్తయ్యకు ఆరోగ్యం కుదట పడేవరకు ఈజీఎస్‌ నిధుల నుంచి నిత్యం కూలీ చెల్లించాలని, వైద్య ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్‌ చేశారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య

యాచారం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో జెండావిష్కరణ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కార్మికులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మిక సంఘం ఆవిర్భవించి నేటికి 54 వసంతంలోకి అడుగు పెట్టిందని, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ఘనత సీఐటీయూకే దక్కిందని బ్రహ్మయ్య పేర్కొన్నారు. కార్మిక చట్టాలను పక్కాగా అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ చందునాయక్‌, నాయకులు సోమయ్య, సత్యనారాయణ, రాములు, లింగమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



అబ్బాస్‌ అలీ (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్‌కు చెందిన మహ్మద్‌ అబ్బాస్‌ అలీ(74) ఈ నెల 27వ తేదీన సాయంత్రం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అతని కుమారుడు ఇనాముల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

జోరుగా నకిలీ దందా

నకిలీ విత్తనాలకు వేదికగా కొడంగల్‌

- బ్రాండెడ్‌ కంపెనీల పేరుతో రైతులకు టోకరా
- ఇదే కేసులో రిమాండ్‌ అనంతరం మళ్లీ దందా కొనసాగిస్తున్న కేటుగాళ్లు
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయ, పోలీసు అధికారులు

కొడంగల్‌: కొడంగల్‌ నియోజకవర్గ సరిహద్దులో ఉన్న కర్నాటక రాష్ట్రం నుంచి నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతోంది. ఈ దందాకు కొడంగల్‌లోని పలు గ్రామాలు వేదికగా మారాయి. కొంతమంది బ్రాండెడ్‌ కంపెనీలకు చెందిన కవర్లను తయారు చేయించి వాటిలో నాసిరకం విత్తనాలు ప్యాకింగ్‌ చేసి రైతులను మోసం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై కొడంగల్‌కు 45 కిలోమీటర్ల దూరంలో తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో కర్నాటక రాష్ట్రంలో గుర్మిట్కల్‌ అనే పట్టణానికి చెందిన ఓ ఎరువుల దుకాణం యజమాని నకిలీ విత్తనాల దందా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను కర్నాటక రాష్ట్రం కుష్టిగిరి జిల్లాలోని ఓ జిన్నింగ్‌ మిల్లు నుంచి పత్తి విత్తనాలు సేకరిస్తాడని ప్రచారం ఉంది. గతంలో 8 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తూ అతడు పట్టుబడ్డాడు. తదనంతరం కర్నాటకలోని పలు ప్రాంతాల్లో కొనుగోలు చేసిన నాసిరకం విత్తనాలకు రంగులు కలిపి బ్రాండెడ్‌ కంపెనీల కవర్లలో ప్యాకింగ్‌ చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఒక ప్యాకింగ్‌ కంపెనీలో బ్రాండెడ్‌ కంపెనీల ఫోర్జరీ కవర్లను కొనుగోలు చేసి ఆ కవర్లలో నాసిరకం విత్తనాలు పోసి ప్యాకెట్లుగా తయారు చేయించి తనకు అనుకూలంగా ఉన్న వ్యాపారులకు ఇచ్చి విక్రయాలు సాగిస్తున్నాడు. నియోజకవర్గంలోని కొడంగల్‌, దౌల్తాబాద్‌ మండలాల్లోని గ్రామాల్లో ఏజెంట్లు ద్వారా నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

గతేడాది జరిపిన సోదాల్లో..

కొడంగల్‌ మండల పరిధిలోని అన్నారంలో గతేడాది ఒకరి ఇంట్లో పోలీసులు జరిపిన సోదాల్లో నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో భాగంగా ఆ ఇంట్లో దొరికిన సామగ్రిని చూసి అధికారులు నివ్వెరపోయారు. 320 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, బ్రాండెడ్‌ కంపెనీల పేరుతో ఉన్న 60 ప్యాకెట్లు, వివిధ కంపెనీల పేరుతో తయారు చేయించిన 290 ఫోర్జరీ కవర్లు, విత్తనాలు కొలిచే డబ్బా దొరికింది. అదే రోజు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో నిందితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు తీగలాగితే డొంక కదిలింది. తదనంతరం పోలీసులు నిఘా పెంచడంతో సూత్రధారులు, పాత్రధారులు పట్టుబడ్డారు. అయితే కొంతకాలానికి వారు రిమాండ్‌ నుంచి బయటకు వచ్చి తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.



నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్‌)

చర్యలు తీసుకుంటాం



నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై, వారికి సరఫరా చేసేవారిపై చర్యలు తీసుకుంటాం. రైతులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి.

– భరత్‌రెడ్డి, ఎస్‌ఐ, కొడంగల్‌

ఇసుక ట్రాక్టర్ల సీజ్‌

పెద్దేముల్‌: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌ చేశారు. పెద్దేముల్‌ ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలు.. బుధవారం అర్ధ రాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో పెద్దేముల్‌ మండలం రుక్మాపూర్‌ గ్రామ శివారులో నైట్‌ పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులకు రెండు ఇసుక ట్రాక్టర్లు తారసపడ్డాయి. ట్రాక్టర్‌ డ్రైవర్లను విచారించగా వారివద్ద ఎలాంటి అనుమతులు లేవు. గురువారం ఉదయం ట్రాక్టర్లను పెద్దేముల్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించి సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

లింగంపల్లి శివారులో..

కుల్కచర్ల: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్‌ చేశారు. కులకచర్ల ఎస్‌ఐ అన్వేష్‌ రెడ్డి తెలిపిన వివరాలు.. చౌడాపూర్‌ మండలం లింగంపల్లి గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి లక్ష్మయ్య ముజాహిద్‌పూర్‌ చెరువు నుంచి ఇసుకను తరలిస్తుండగా అదే సమయంలో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలిసులకు ఎదురుపడ్డాడు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని సమాధానం ఇవ్వడంతో ట్రాక్టర్‌ను పోలిస్‌ స్టేషన్‌కు తరలించి సీజ్‌ చేశారు.

గడిబావిలో శవం లభ్యం

- మృతుడు పాత తాండూరుకు చెందిన వెంకటేశ్‌గా గుర్తింపు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



వెంకటేశ్‌ మృతదేహం

తాండూరు టౌన్‌: పాత తాండూరులోని గడిబావిలో ఓ వ్యక్తి శవం లభ్యమైంది. పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్‌ తెలిపిన వివరాలు.. పాత తాండూరు శివారులోని గడిబావిలో గురువారం శవం తేలి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మున్సిపల్‌ సిబ్బంది సహాయంతో శవాన్ని బయటకు తీయగా.. స్థానికులు ఎవరూ గుర్తించలేదు. దీంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి ఫొటోలను సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేయగా విషయం తెలుసుకున్న మృతుడి తల్లి జెట్టిపాగ చంద్రమ్మ.. మృతుడు తన కొడుకు జెట్టిపాగ వెంకటేశ్‌(35)గా గుర్తించింది. పాత తాండూరులోని అంబేడ్కర్‌ నగర్‌లో నివాసం ఉండే వెంకటేశ్‌ హైదరాబాద్‌లో సెంట్రింగ్‌ పనిచేస్తుంటాడు. తాగుడుకు బానిస కావడంతో ఐదేళ్ల క్రితం భార్య అతడిని వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా బుధవారం తాండూరుకు వచ్చిన వెంకటేశ్‌ సాయంత్రం ఇంట్లోనే సెల్‌ఫోన్‌ పెట్టి బయటకు వెళ్లాడు. అయితే గడిబావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా లేదా మరేదైనా జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యథేచ్ఛగా ఫిరంగి వాగు కబ్జా



ఫిరంగి వాగులో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు

- పట్టించుకోని ఇరిగేషన్‌ అధికారులు

తుక్కుగూడ: నగర శివారు ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. వాగులు, వంకలను సైతం వదలడం లేదు. యథేచ్ఛగా కబ్జాలు చేస్తూ వాటిని స్వరూపాన్ని మార్చి వేస్తున్నారు. తమకి అనుకూలంగా నిర్మాణాలు చేపట్టి విక్రయించి కాసులు దండుకుంటున్నారు. దీంతో వర్షాలు కురిసిన సమయంలో వరద నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తి వ్యవసాయ పంటలు, రోడ్లు పూర్తిగా మునిగిపోతున్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల రెవిన్యూ పరిధిలోని ఫిరంగి వాగును కొందరు రియల్టర్లు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. రావిర్యాల పెద్ద చెరువు నుంచి ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు వరద నీరు పోయే అతి పెద్ద వాగు ఇదే. గతంలో వాగు నుంచి వచ్చే నీటితో రైతులు పంటలను సాగు చేసే వారు. ప్రస్తుతం ఈ వాగు విస్తీర్ణాన్ని సగానికి పైగా అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డు ఆదిబట్లకు పోయే ప్రధాన రహదారిలో కబ్జా చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్‌ అధికారులు స్పందించి వాగు భూమిని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగును పరిశీలిస్తాం

రావిర్యాల పెద్ద చెరువు నుంచి వరద నీరు పారే ఫిరంగి వాగులో నిర్మాణాలు జరుగు తున్న విషయంపై త్వరలోనే పరిశీలిస్తాం. వాగును కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– బాలాజీ, ఏఈ ఇరిగేషన్‌, మహేశ్వరం

గంజాయి విక్రేతల అరెస్టు

చేవెళ్ల: తమ వద్ద ఉన్న గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి గుట్టు చప్పుడు కాకుండా తెలిసిన వ్యక్తులకు అమ్ముతున్న ఇద్దరు వలస కూలీలను ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఏన్కేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌ రాష్ట్రానికి చెందిన సాహీర్‌మియా, నూర్‌ఇస్లామ్‌లు మండలంలోని ఏన్కేపల్లి చౌరస్తాలో ఓ గదిని అద్దెకు తీసుకొని సెంట్రింగ్‌ కూలీలుగా పనులు చేస్తున్నారు. వీరు తమ వద్ద ఉన్న గంజాయిని చిన్ని చిన్న ప్యాకెట్లుగా చేసి శంకర్‌పల్లి మండలంలో తెలిసిన వ్యక్తులకు అమ్ముతున్నారు. పక్కా సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు వారిని గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి 700ల గ్రాములు గంజాయికి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా కేసులో ఏడుగురి బైండోవర్‌

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో గురువారం తహసీల్దార్‌ ముంతాజ్‌ ఎదుట ఏడుగురిని ఎక్సైజ్‌ పోలీసులు బైండోవర్‌ చేశారు. నాటుసారా కేసులలో అరెస్టు అయిన వారిలో కొందరిని బైండోవర్‌ చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ బద్యానాద్‌ చౌహాన్‌ తెలిపారు. దేపావత్‌ రమేశ్‌, రామావత్‌ రమేశ్‌, కేతావత్‌ బక్క, కేతావత్‌ మోతీ, ఇస్లావత్‌ వాల్య, సిలివేరు చెన్నయ్య, సబావత్‌ చంద్రానాయక్‌లను బైండోవర్‌ చేశామని ఆయన వివరించారు. బైండోవర్‌ అయినవారు ఏడాదిలోపు మరోకేసులో ఉంటే రూ.1 లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని సీఐ చెప్పారు.

భూ కబ్జాపై కేసు నమోదు

నందిగామ: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపాలకృష్ణ గురువారం తెలిపారు. మండల పరిధిలోని రంగాపూర్‌ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన సల్వేంద్రిగూడ గ్రామానికి ఆనుకొని సర్వే నంబరు 499 లోని ఇనాం భూమిలో సుమారు 10 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన మల్లెల అనిత కబ్జా చేసి ప్రీకాస్ట్‌ ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు ప్రీ కాస్ట్‌ను ఇటీవల తొలగించారు. ఇనాం భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐ రోజా ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాల ప్యాకెట్‌ కోసం వెళ్లి..



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కనకప్రసాద్‌, చిత్రంలో రోదిస్తున్న కుమారుడు

కళ్లముందే తండ్రి విగతజీవిగా పడి ఉండటాన్ని ఆ పసి హృదయం తట్టుకోలేకపోయింది. ఉబికి వస్తున్న దుఃఖం..వచ్చీరాని మాటలతో నాన్నను.. లేపేందుకు ప్రయత్నిస్తూ గుండెలవిసేలా రోదించాడు. ఆ చిన్నారి గోసను చూసి స్థానికులు కళ్లు చెమర్చారు. ఈ విషాద సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మృతదేహం వద్ద విలపించిన రెండేళ్ల కుమారుడు

అబ్దుల్లాపూర్‌మెట్‌: జీవనోపాధి కోసం సొంత ఊరును విడిచి నగరానికి వచ్చాడు. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోందని భావించాడు. కానీ రోడ్డు ప్రమాదం అతని ఆశల్ని చిదిమేసింది. రెండేళ్ల కుమారుడితో కలిసి పాల ప్యాకెట్‌ కోసం బయటకు వెళ్లిన వ్యక్తిని అతి వేగంతో వచ్చిన వాహనం బలికొంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం అత్తివాడులు గ్రామానికి చెందిన శెట్టి కనకప్రసాద్‌(35) తన భార్య పిల్లలతో కలిసి మండలంలోని ఇనాంగూడలో ఉంటూ ప్రైవేటు జాబ్‌ చేస్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు పాల ప్యాకెట్‌ కోసం తన ద్విచక్ర వాహనంపై రెండేళ్ల కుమారుడు శివకుమార్‌ను వెంట తీసుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌ కూడలికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇనాంగూడ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న ఓ డీసీఎం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకప్రసాద్‌ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, అతని కుమారుడు శివకుమార్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెలవిసేలా రోదించిన బాలుడు

తనతో ముచ్చటిస్తూ వచ్చిన తన తండ్రి రోడ్డుపై విగతజీవిగా పడి ఉండడంతో.. ఏం జరిగిందో తెలియని చిన్నారి తండ్రి మృతదేహం పక్కనే కూర్చుని.. దిక్కులు చూస్తూ గుక్క పెట్టి ఏడ్చాడు. ఇది చూసిన వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన కొన్ని నిమిషాల్లోనే భర్త తనకు దూరమయ్యాడని సంఘటనా స్థలంలో మృతుడి భార్య గుండెలవిసేలా రోదించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందిగామ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వీర్లపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఘనపురం కుమార్‌(28) తాగుడుకు బానిసగా మారాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఈ నెల 23న భార్యతో గొడవ పడి కుమార్‌ తన ఒంటికి నిప్పంటించుకున్నాడు. చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



ఎస్‌ఐ శరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌కుమార్‌

షాద్‌నగర్‌రూరల్‌: ఫరూఖ్‌నగర్‌ మండలంలోని కందివనం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని మానస మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని యువసత్తా యూత్‌ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్‌ఐ శరత్‌కుమార్‌కు ఆయన యూత్‌ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. విద్యార్థిని మానసను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, ఈ వ్యవహారంలో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థినికి మాయమాటలు చెప్పి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మానసను హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించాడని అన్నారు. మానస మరణంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

ఖరీఫ్‌ సాయానికి రైతుల ఎదురుచూపు



ఎకరానికి రూ.15వేలు ఇస్తామన్న ప్రభుత్వం

- వానాకాలం ప్రారంభమైనా స్పష్టత కరువు
- అయోమయంలో కర్షక లోకం

షాబాద్‌: వర్షాకాలానికి సమయం దగ్గర పడుతోంది. నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని భారత వాతావరణశాఖ గురువారం ధ్రువీకరించింది. పక్షం రోజుల్లో పంటల సాగుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. ఖరీఫ్‌ సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు.. పెట్టుబడి కోసం నిరీక్షిస్తున్నారు. అయితే రైతు భరోసాపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో మార్గదర్శకాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన కర్షకుల్లో వ్యక్తమవుతోంది.

రైతుల ప్రోత్సాహానికి..

రైతులకు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితిని తప్పించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద ఏటా రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.10వేల చొప్పున అందించారు. తాము అధికారంలోకి వస్తే ఈ సాయాన్ని రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ యాసంగి సీజన్‌లో పాత పద్ధతిలోనే ఎకరానికి రూ.5 వేల చొప్పున అందించారు. ఈ సీజన్‌ నుంచి సాయం పెంచుతామని అప్పట్లో ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే ఖరీఫ్‌ సాగు సమయం సమీపిస్తున్నప్పటికీ పెట్టుబడి సాయం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

విధివిధానాలు ఎప్పుడూ?

నిధుల కొరత కారణంగా యాసంగికి సంబంధించిన పెట్టుబడి సాయాన్ని విడతల వారీగా పంపిణీ చేశారు. దీంతో రైతు భరోసాకు పరిమితులు విధిస్తారన్న ప్రచారం జరిగింది. అనర్హులకూ రైతు భరోసాను అందించడం ద్వారా ప్రజాధనం వృథా అయ్యిందని ప్రస్తుత పాలకులు భావిస్తున్నారు. రోడ్లు, గుట్టలు, సాగు యోగ్యంగా లేని భూములు, వెంచర్లుగా మారిన భూములకు పెట్టుబడి సాయం చెల్లించకూడదని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రైతు భరోసాను ఐదెకరాలలోపు రైతులకు పరిమితం చేయాలని చూస్తున్నారని సమాచారం. అయితే ఈ అంశాలపై స్పష్టత లేదు. రైతుభరోసా అమలుకు సంబంధించిన విధివిధానాలపై ఎలాంటి ముందడుగు కనిపించలేదు. గతంలో జూన్‌లోనే ఖరీఫ్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం జమ చేయడం ప్రారంభించేవారు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు కోసం పెట్టుబడులు సమకూర్చుకునే సమయం కావడంతో రైతులు మదన పడుతున్నారు. పంట వేయడానికి ముందే పెట్టుబడి సాయం అందిస్తే ఉపయోగపడుతుందని రైతులు కోరుతున్నారు.

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. రైతుల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి విధివిధానాలు రావాల్సి ఉంది. నిధులు విడుదల కాగానే అర్హుల ఖాతాలలో పెట్టుబడి సాయం జమ చేస్తాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

గుళికల మందు తిని యువకుడి బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్‌: గుళికల మందు తిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ రాంచందర్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దుల రమేష్‌ యాదవ్‌(25) గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈనెల 26న రాత్రి తీవ్రంగా కడుపునొప్పి రావడంతో భరించలేని రమేష్‌ యాదవ్‌ ఇంట్లో గుళికల మందు తిని అపస్మారక స్థితిలో చేరుకున్నారు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ని చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రమేష్‌యాదవ్‌ ఈనెల 29న రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

జీవాలకు టీకాలు వేయించాలి

పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్‌: మూగజీవాల ఆరోగ్యంపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్‌, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో మూగజీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తుందని, గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి తమ జీవాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.